## క్లుప్తంగా

### లింగనిర్ధారణ చట్టరీత్యా నేరం



రిజిస్ట్రేషన్ పత్రాలు అందిస్తున్న ప్రమోద్ కుమార్

**జగిత్యాల:** లింగనిర్ధారణ చేయడం చట్టరీత్యా నేరమని డీఎంహెచ్‌వో ప్రమోద్‌కుమార్ అన్నారు. శనివారం లింగ నిర్ధారణ నిషేధ చట్టం 1994 కింద నమోదైన ఆస్పత్రులకు కొత్తగా నమోదు చేసుకున్న ఆరు కేంద్రాలకు సర్టిఫికెట్స్ అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చట్టం ప్రకారం ఎవరైనా పుట్టబోయే శిశువు ఆడ/మగ అని నిర్ధారణ చేస్తే జైలుశిక్షతో పాటు, జరిమానా విధిస్తామన్నారు. స్కానింగ్ వివరాలు నెలవారి రిపోర్ట్‌ను ఆన్‌లైన్‌లో నమోదు చేసి ప్రతినెల 5వ తేదీలోపు సమర్పించాలన్నారు. కార్యక్రమంలో జైపాల్‌రెడ్డి,శ్రీనివాస్,భూమేశ్వర్ పాల్గొన్నారు.

### క్షయ నిర్మూలనలో భాగస్వామ్యం కావాలి



అవగాహన కల్పిస్తున్న డీఎంహెచ్‌వో శ్రీనివాస్

**కోరుట్ల:** క్షయ వ్యాధి నిర్మూలనలో ప్రతీ ఒక్కరూ భాగస్వాములు కావాలని జిల్లా డిప్యూటీ డీఎంహెచ్‌వో ఎస్. శ్రీనివాస్ అన్నారు. పట్టణంలోని ప్రభుత్వ ఆస్పత్రిలో క్షయ విజేతలకు టీబీ అలర్ట్ ఇండియా, ఇంపాక్ట్ ఇండియా ప్రాజెక్టు ఆధ్వర్యంలో శనివారం ఒక రోజు శిక్షణా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా క్షయ వ్యాధి లక్షణాలు, నివారణ. గ్రామాల్లో అవగాహనా కార్యక్రమాలపై వివరించారు. కార్యక్రమంలో డీపీపీఎం కట్ట హరీశ్, టీబీ సూపర్‌వైజర్ ఇమ్రాన్, ఆంజనేయులు, మల్లిఖార్జున్, టీబీ అలర్ట్ ఇండియా జిల్లా బాధ్యులు దాసరి అనిల్,శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

### హెచ్‌ఐవీ పట్ల అవగాహన కల్పించాలి



పోస్టర్లు ఆవిష్కరిస్తున్న వైద్య సిబ్బంది

**కోరుట్ల:** ప్రజలకు హెచ్‌ఐవీ, ఎయిడ్స్‌పై అప్రమత్తంగా ఉండే విదంగా అవగాహన కల్పించాలని ప్రభుత్వ ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ సునీతా రాణి అన్నారు. డిసెంబర్ 1 ప్రపంచ ఎయిడ్స్ డే సందర్భంగా గోడ పత్రికలు, బ్యానర్లను శనివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సునీత మాట్లాడుతూ హెచ్‌ఐవీ అనేది హ్యూమన్ ఇమ్యూనో డెఫీషియన్సీ వైరస్ ద్వారా సంక్రమిస్తుందని, 2030 నాటికి హెచ్‌ఐవీ లేని సమాజ స్థాపనే మనందరి లక్ష్యం కావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో వైద్యులు, ఐసిటిసి సిబ్బంది, ల్యాబ్,ట్రేనీ ల్యాబ్ టెక్నిషియన్లు పాల్గొన్నారు.

### ప్రజల సహకారంతోనే నేరాల నియంత్రణ



మాట్లాడుతున్న రూరల్ సీఐ కృష్ణారెడ్డి


**జగిత్యాలక్రైం:** గ్రామాలు, పట్టణాల్లో ప్రజల సహకారంతోనే నేరాల నియంత్రణ సాధ్యమని జగిత్యాల రూరల్ సీఐ కృష్ణారెడ్డి అన్నారు. శనివారం రాత్రి రూరల్ పోలీస్‌స్టేషన్‌లో దేవాలయాలు, మసీదులు, చర్చీల నిర్వాహకులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ దేవాలయాలు, మసీదులు, చర్చీల వద్ద ప్రజల సహకారంతో సీసీకెమెరాలను ఏర్పాటు చేయాలన్నారు. సీసీకెమెరాల ఏర్పాటుతో నేరాల నియంత్రణ సాధ్యమవుతుందని, ఏదైనా అవాంచనీయ సంఘటన జరిగినా నింధితులను గుర్తించేందుకు సీసీకెమెరాలు ఎంతో ఉపయోగపడతాయన్నారు. కార్యక్రమంలో రూరల్ ఎస్సై సదాకర్ పాల్గొన్నారు.

**సీసీకెమెరాలు ఏర్పాటు చేసుకోవాలి**

**రాయికల్:** పట్టణంతో పాటు, మండలంలోని ఆలయాలు, ప్రార్థన మందిరాల ఎదుట సీసీకెమెరాలను ఏర్పాటు చేసుకోవాలని ఎస్సై సుధీర్‌రావు అన్నారు. శనివారం రాత్రి రాయికల్ ఠాణాలో ఆలయ కమిటీ సభ్యులతో సమావేశం నిర్వహించారు. ప్రతి ఆలయ ఆవరణలో తప్పనిసరిగా సీసీకెమెరాలను ఏర్పాటు చేసుకోవాలని, దీంతో దొంగతనాలను అసాంఘీక కార్యకలాపాలను కట్టడి చేయవచ్చన్నారు.

# ఆదర్శ సాహితీ వనమాలి

- నాలుగు వేదాలు.. ఆధ్యాత్మిక పుస్తక రచనలు.
- వృద్ధాప్యంలోనూ సాహితీ సేవ
- గొప్ప రచనలు ఎంవీ.నర్సింహారెడ్డి సొంతం




నర్సింహారెడ్డి రచనలు

**మల్యాల:** పాఠశాల స్థాయి నుండే రచనలు చేస్తూ, ఎనిమిది పదుల వయసులో సైతం సాహితీసేవలందిస్తున్న సాహితీ వనమాలి వేదాల నర్సింహారెడ్డి. సమాజాభివృద్ధి కోసం, ప్రజల్లో చైతన్యం కల్పించడంతోపాటు, రచనలకు పునాదిరాయి వేసి, ఆధ్యాత్మికత పెంపొందించే పుస్తకాలతోపాటు వివిధ రచనలు చేసి, గ్రంథాలయాలకు వందలాది పుస్తకాలను అందజేశారు.

మల్యాల మండలం తక్కళ్లపల్లి గ్రామానికి చెందిన ముదుగంటి వెంకట నర్సింహారెడ్డి జగిత్యాల పట్టణంలోని ఓల్డ్ హైస్కూల్ పదకొండో తరగతి చదివే రోజుల్లోనే పాఠశాల ప్రిన్సిపాల్ ముద్దు రామకృష్ణయ్య ప్రోత్సాహంతోనే ప్రేమ జీవులు ఆదర్శ త్యాగాలు నవల రాశారు. దీంతో ప్రిన్సిపాల్ ముద్దు రామకృష్ణయ్య చేత వెండి మెమెంటో అందుకున్నారు. అప్పటి నుంచి వెనుదిరిగి చూడకుండా హాస్య రచనలు, అకాడమీ పుస్తకాలు, తెలుగు వ్యాకరణ పుస్తకాలు రాయడంతోపాటు నాలుగు వేదాలను సామాన్యుల భాషలోకి అనువాదం చేసి, సాహితీసేవ చేస్తున్నారు.

**తెలుగు భాషాభివృద్ధికి పునాది..**

ఉమ్మడి ఆంధ్ర ప్రదేశ్‌లో తెలంగాణ భాషా, యాసను మరింత ప్రాచుర్యంలోకి, రచనల్లోకి తీసుకురావాలనే సంకల్పంతో 2000 సంవత్సంలో తెలంగాణ భాషా సంఘం ఏర్పాటు చేసి, తెలంగాణ యాసను విస్తృతంగా ప్రచారంలోకి తీసుకువచ్చేందుకు కృషి చేశారు.

ఏటా తెలంగాణ యాస, భాషలపై సెమినార్లు, సాహిత్య సమాలోచనలు చేస్తూ, ఉగాదికి కవి సమ్మేళనాలు నిర్వహిస్తూ, భాష సంరక్షణకు కృషి చేశారు. వివిధ రంగాల్లో కృషి చేసిన వారికి సాహిత్య పురస్కారాలు అందజేశారు. తెలుగు బోధనా పద్ధతులు, తెలుగు సాహిత్య సుమదళాలు అలంకారులు–భాషా శాస్త్రం, తెలుగు వ్యాకరణ కల్ప తరువు వంటి పుస్తకాలు రచించారు. ఏటా ఉగాది పండుగ నాడు కవితల పోటీలు నిర్వహిస్తుండడంతోపాటు, రచనలో మెళకువలపై అవగాహన కల్పించారు.

**ఆధ్యాత్మికత కోసం..**

ప్రజలను ఆధ్యాత్మికత వైపు వేయించేందుకు తన వంతు సేవలందించారు. రుగ్వేదం, యజుర్వేదం, అధర్వణ వేదం సామవేదాలను సామాన్యుల భాషలోకి సరళంగా అనువాదం చేసి, వేదాల నర్సింహారెడ్డి గుర్తింపు పొందారు. భగవద్గీత, బ్రహ్మసూత్రాలు వంటి ఆధ్యాత్మిక రచనలు చేశారు. నాలుగు వేదాలను యూట్యూబ్‌లో అప్‌లోడ్ చేసి, ప్రపంచంలోని నలుమూల్లోని ప్రజలకు వేదాలను అందుబాటులోకి తీసుకువచ్చారు.

మల్యాల మండలం ముత్యంపేట గ్రామంలో శ్రీ రమాసహిత సత్యనారాయణ ఆలయం నిర్మించి, ఏటా సామూహిక సత్యనారాయణ వ్రతాలు నిర్వహిస్తారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన మొదటి ఏడాది ఉగాది పండుగ నాడు అప్పటి ముఖ్యమంత్రి కేసీఆర్ చేతుల మీదుగా పురస్కారం అందుకున్నారు.

**యువ రచయితలకు ప్రోత్సాహం అందించాలి**



భవిష్యత్ తరాలకు పుస్తకాల రూపంలో విజ్ఞానం అందించాలనే సంకల్పంతో నాలుగు వేదాలతోపాటు పలు రచనలు చేశాను. పాఠశాల స్థాయి నుండే విద్యార్థులకు రచన పట్ల ఆసక్తి పెంపొందించాలి. రచనా విభాగంలో నూతనంగా అడుగు పెట్టేవారికి ప్రభుత్వం ప్రోత్సాహం అందించాలి.

హాస్యశ్రీ వేదాల నర్సింహారెడ్డి

## నియోజవర్గ అభివృద్ధే లక్ష్యంగా పనిచేస్తా

- జగిత్యాల ఎమ్మెల్యే సంజయ్ కుమార్



చెక్కులు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే సంజయ్‌కుమార్

**సారంగాపూర్:** నియోజకవర్గ అభివృద్ధే లక్ష్యంగా పనిచేస్తానని జగిత్యాల ఎమ్మెల్యే సంజయ్‌కుమార్ అన్నారు. బీర్‌పూర్ మండలం కొల్వాయిలో మండలానికి చెందిన లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి, సీఎంఆర్‌ఎఫ్ చెక్కులను పంపిణీ చేశారు. నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేయడానికి తన వంతు కృషిచేస్తానని పేర్కొన్నారు. బీర్పూర్ పీహెచ్‌సీ ఏర్పాటుకు రూ.1.40 కోట్లు మంజూరైనట్లు తెలిపారు. తుంగూర్‌లో కేజీబీవీ ఏర్పాటవుతుందని తెలిపారు. కార్యక్రమంలో కేడీసీసీ బ్యాంక్ డైరెక్టర్ ముప్పాల రాంచందర్‌రావు, తహసీల్దార్ ముంతాజొద్దీన్, ఎంపీడీవో లచ్చాలు,డిప్యూటి తహసీల్దార్ శ్రీనివాస్, ఆర్‌ఐ శ్రీనివాస్,ఎంఈవో నాగభూషణం తదితరులు పాల్గొన్నారు.

## చిన్నారుల ఆరోగ్యంపై శ్రద్ధ చూపాలి

**పెగడపల్లి:** చిన్నారుల ఆర్యోగంపై ప్రత్యేక శ్రద్ధ చూపాలని మల్యాల ఐసీడీఎస్ ప్రాజెక్టు సీడీపీవో వీరలక్ష్మి అన్నారు. మండలకేంద్రంలోని రెండో అంగన్‌వాడీ కేంద్రంలో శనివారం సెక్టార్ సమావేశం మాట్లాడారు. పిల్లల ఎత్తులు, బరువులను తీయించి ఎదుగుదల లోపం ఉన్న చిన్నారులను గుర్తించాలన్నారు. కేంద్రాల్లోని పిల్లలకు, లబ్ధిదారులకు పంపిణీ జరుగుతున్న పాలు, గుడ్లు, పోషకాహారం నాణ్యతను పరిశీలించి తీసుకోవాలన్నారు. వంటగది, వంట సామాగ్రి, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలన్నారు. సూపర్‌వైజర్ మహేశ్వరి, లక్ష్మణ్ పాల్గొన్నారు.

## సంక్షిప్త వార్తలు

**• ఎస్సీ కార్పొరేషన్ రుణాలు పొందాలి**

**ఇబ్రహీంపట్నం:** ఎస్సీ కార్పొరేషన్ నుంచి 100 రకాల సబ్సిడీ రుణాలు అందిస్తున్నామని ఎస్సీలు సద్వినియోగం చేసుకోవాలని ఎస్సీ కార్పొరేషన్ ఏఈవో రవీందర్ అన్నారు. శనివారం మండలంలోని కోజన్‌కొత్తూర్, కేశాపూర్‌లో గ్రామస్తులతో సమావేశం నిర్వహించారు. ఎస్సీ కార్పొరేషన్ నుంచి 100 శాతం సబ్సిడీతో బోర్‌వెల్, రూ.1,40 లక్షల సబ్సిడీతో పాడిపరిశ్రమకు రుణాలు ఇస్తున్నామని, ఇవే కాకుండా మరిన్ని రుణాలను 100 శాతం సబ్సిడీతో ఇస్తున్నట్లు వివరించారు. ఎస్సీ కార్పొరేషన్ రుణాలు తీసుకోవాలనుకునే వారు ఎంపీడీవోను సంప్రదించి దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు రాకేశ్, రాణి, సీవో గణేశ్, తదితరులు పాల్గొన్నారు.

**• సింహగర్జన విజయవంతం చేయాలి**

**రాయికల్:** మాలల హక్కుల సాధన కోసం హైదరాబాద్‌లో నేడు నిర్వహించే మాలల సింహగర్జనను విజయవంతం చేయాలని నాయకులు చెంగలి గంగాధర్, రత్నాకర్, ప్రవీణ్, నీరటి శ్రీను, రాజనాల మధుకర్, జాన గోపి శనివారం తెలిపారు.

**• అధికారుల పర్యవేక్షణ శూన్యం**

**జగిత్యాల:** కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చి ఏడాది గడుస్తున్నా ఇంత వరకు విద్యాశాఖ మంత్రి లేడని, పాఠశాలలపై అధికారుల పర్యవేక్షణ శూన్యమైందని ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా అధ్యక్షుడు వినోద్‌కుమార్ అన్నారు. ఫుడ్‌పాయిజన్ ఘటనలపై బంద్‌కు పిలుపునివ్వగా విజయవంతం అయింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, పాఠశాలల్లో హాస్టళ్లలో తరుచూ ఫుడ్ పాయిజన్ అయి విద్యార్థులు అస్వస్థతకు గురవుతున్నారని, ఇప్పటికైనా అధికారులు చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో వినయ్, అరవింద్ పాల్గొన్నారు.

**• వేంకటేశ్వర ఆలయ చైర్మన్‌గా రాజేశ్**

**కోరుట్లరూరల్:** మండలంలోని వెంకటాపూర్ గుట్టపై ఉన్న అతి పురాతన శ్రీ వేంకటేశ్వర ఆలయ చైర్మన్‌గా కటుకం రాజేష్ నేత నియమితులయ్యాడు. ఈ మేరకు నియామక ఉత్తర్వులను కాంగ్రెస్ కోరుట్ల నియోజకవర్గ ఇంచార్జి జువ్వాడి నర్సింగరావు రాజేశ్‌కు శనివారం అందజేశారు. డైరెక్టర్లుగా పిట్టల రమేష్, ద్యాగ రాజరెడ్డి, రాజేశం గౌడ్, గంగాలక్ష్మి–నర్సయ్య, నూతిపెల్లి మధు, గంద్ర వెంకటగోపాల్ రావు నియమితులయ్యారు. నూతన కమిటీని కాంగ్రెస్ నాయకులు జువ్వాడి కృష్ణారావు బీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు గడ్డం వెంకటేష్ గౌడ్, నాయకులు అభినందించారు.

**• మధ్యాహ్న భోజన పర్యవేక్షణ బాధ్యతలు తొలగించాలి**

**రాయికల్:** మధ్యాహ్న భోజన పర్యవేక్షణ బాధ్యతల నుంచి ఉపాధ్యాయులను తప్పించాలని ఎస్టీయూ జిల్లా అధ్యక్షుడు మచ్చ శంకర్ అన్నారు. శనివారం రాయికల్ మండలంలోని పలు పాఠశాలల్లో ఎస్టీయూ సభ్యత్వ నమోదు చేపట్టారు. మధ్యాహ్న భోజనం విషయంలో ఉపాధ్యాయులను సస్పెండ్ చేయడం సరికాదన్నారు. కార్యక్రమంలో జిల్లా అసోసియేట్ అధ్యక్షుడు పాలెపు శివరామకృష్ణ, రాయికల్ మండల అధ్యక్షుడు విద్యమణికృష్ణ, నాయకులు ఆడెపు రాజశేఖర్ పాల్గొన్నారు.

**• విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలి**

**కోరుట్ల రూరల్:** ప్రభుత్వ పాఠశాలలు, రెసిడెన్షియల్ స్కూళ్లు, హాస్టళ్లలో విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలని తహసీల్దార్ కిషన్ అన్నారు. స్థానిక మండల పరిషత్ సమావేశ మందిరంలో శనివారం ప్రభుత్వ పాఠశాలల హెచ్‌ఎంలు, మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్, కస్తూరిబా గాంధీ ప్రత్యేక అధికారి తో సమీక్షా సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో మండల పరిషత్ అధికారి రామకృష్ణా, ఎంఈవో నరేశం, నోడల్ అధికారి రాజేంద్ర ప్రసాద్, కాంప్లెక్స్ హెచ్‌ఎంలు ఆనంద రావు, కృష్ణమోహన్, భూమయ్య, శ్రీనివాస్, సీఆర్‌పీలు పాల్గొన్నారు.

**• రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్ పోటీలకు గురుకుల విద్యార్థి ఎంపిక**

**జగిత్యాల:** జిల్లా కేంద్రంలోని గురుకుల పాఠశాలకు చెందిన విద్యార్థి ఇమ్మాన్యుయల్ రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్ పోటీలకు ఎంపికయ్యారు. మెట్‌పల్లిలో జరిగిన జిల్లాస్థాయి పోటీల్లో 100 మీటర్ల పరుగు పందెంలో గోల్డ్‌మెడల్ సాధించి రాష్ట్రస్థాయికి ఎంపికయ్యారు. మంచిర్యాలలో జరిగే అండర్ -12 కేటగిరి రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొనున్నారు. ఈ సందర్భంగా విద్యార్థిని ప్రిన్సిపాల్ దాసరి రాజేందర్, శ్రీధర్, ముఖీమ్, అంజయ్య అభినందించారు.

**• విద్యార్థులకు మౌలిక వసతులు ఉండేలా చూడాలి**

**జగిత్యాలరూరల్:** విద్యార్థులకు అన్ని రకాల మౌలిక వసతులు ఉండేలా చూడాలని, హాస్టల్ వసతి గృహ భోజనంపై ప్రత్యేక దృష్టి సారించాలని డీఈవో రాము నాయక్ అన్నారు. శనివారం జగిత్యాల రూరల్ మండలం కండ్లపల్లి మోడల్‌ను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, వసతి గృహంలోని విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ సరితదేవి, వైస్ ప్రిన్సిపాల్ నగేశ్, పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

**• మధ్యాహ్న భోజనం నాణ్యతాలోపానికి ప్రభుత్వాలే కారణం**

**కోరుట్ల:** ప్రభుత్వ పాఠశాలల్లో మధ్యాహ్న భోజనం నాణ్యతా లోపానికి ప్రభుత్వాలే కారణమని ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు సుతారి రాములు అన్నారు. పట్టణంలోని ప్రభాకర్ స్మారక భవన్‌లో మధ్యాహ్న భోజన కార్మికులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉంటే మెస్ చార్జీలు రూ. 20 కి పెంచాలని నిత్యావసర సరుకులు, సిలిండర్లు ప్రభుత్వమే సరఫరా చేయాలన్నారు.కార్యక్రమంలో నాయకులు పద్మక్క, సాయమ్మ, భాగ్య, జమున, రాజు, చంద్రకళా,సఫియా బేగం, లక్ష్మి పాల్గొన్నారు.

**• మైనార్టీ వెల్ఫేర్ గురుకుల పాఠశాల తనిఖీ**

**మెట్‌పల్లిరూరల్:** మెట్‌పల్లి పట్టణ శివారులోని మైనార్టీ వెల్ఫేర్ గురుకుల పాఠశాలను మెట్‌పల్లి ఆర్డీవో శ్రీనివాస్,కాంగ్రెస్ నాయకుడు జువ్వాడి కృష్ణారావు శనివారం సందర్శించారు.ఈ సందర్భంగా గురుకులంలోని వసతులు,సౌకర్యాలు పరిశీలించారు.విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. కార్యక్రమంలో నాయకులు పాల్గొన్నారు.

**• నేడు వ్యాసరచన పోటీలు**

**సారంగాపూర్:** సారంగాపూర్, బీర్‌పూర్ మండలాల్లో వివిధ పాఠశాలాల్లోని విద్యార్థులకు ప్రజాపాలన విజయోత్సవాల్లో భాగంగా ఆదివారం రెనెవబుల్‌ఎనర్జీ (పునరుత్పాదక శక్తి ) పై వ్యాసరచన పోటీలు నిర్వహిస్తున్నట్లు సారంగాపూర్ ఎంఈవో బుగ్గారపు కిషోర్, బీర్‌పూర్ ఎంఈవో నాగభూషణంలు తెలిపారు.

**మేడిపల్లి:** ప్రజా పాలన విజయోత్సవాల్లో భాగంగా భీమారం మండల కేంద్రంలో నేడు విద్యార్థులకు వ్యాస రచన పోటీలు నిర్వహిస్తున్నట్లు ఎంఈవో మధుసూదన్ రెడ్డి తెలిపారు.

పెగడపల్లి:మండల కేంద్రంలోని విద్యా వనరుల కేంద్రంలో ఆదివారం విద్యార్థులకు మండల స్థాయిలో వ్యాస రచన పోటీలు జరుగుతాయని మండల విద్యాధికారి సులోచన తెలిపారు.

**• మూఢ నమ్మకాలు పారదోలాలి**

**కథలాపూర్:** గ్రామాల్లో మూఢనమ్మకాలను పారదోలాలని ఎస్సై నవీన్‌కుమార్ అన్నారు. మండలంలో సిరికొండలో మూఢ నమ్మకాలు, సైబర్ క్రైంలపై శనివారం రాత్రి పోలీస్ కళాబృందం సభ్యులు ప్రదర్శనలిచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అపరిచిత వ్యక్తులు ఫోన్ చేసి ఓటీపీ చెప్పమంటే స్పందించవద్దన్నారు. ఆధునిక టెక్నాలజీ అందుబాటులోకి వచ్చిందని, ప్రజలు మూఢనమ్మకాలను విశ్వసించవద్దన్నారు.

**• బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం**

**ధర్మపురి :** రోడ్డు ప్రమాదంలో గాయపడి ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న యువకుడికి ప్రభుత్వ విప్ అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ ఆర్థిక సాయాన్ని అందజేసారు. మండలంలోని నేరెల్ల గ్రామానికి చెందిన ఈదునూరి వేణుగోపాల్ ఇటీవల రోడ్డు ప్రమాదానికి గురై ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. విషయం తెలిసిన వెంటనే విప్ లక్ష్మణ్‌కుమార్ స్పందించి ఆస్పత్రి యాజమాన్యంతో మాట్లాడి బిల్లులో కొంతవరకు మాఫీ చేయించారు. అంతే కాకుండా వైద్య ఖర్చుల కోసం రూ.10 వేలు, మండల కాంగ్రెస్ నాయకులు రూ. 10 వేలు మొత్తం 20 వేల రూ.లు బాధితుడి కుటుంబానికి శనివారం స్థానిక ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో అందజేశారు.

**విద్యుత్‌మోటార్ల కాపర్ వైరు చోరీ**

**కథలాపూర్:** గ్రామశివారులోని ఎస్సారెస్పీ వరద కాలువ వెంబడి విద్యుత్ మోటార్ల కాపర్ వైర్లు దొంగలు ఎత్తుకెళ్లినట్లు రైతులు శనివారం తెలిపారు. సుమారు 30 మంది రైతులకు చెందిన విద్యుత్ మోటార్ల కాపర్ వైర్లను దొంగలు కట్ చేసి ఎత్తుకెళ్లినట్లు బాధిత రైతులు తెలిపారు. రాత్రివేళల్లోదొంగతనాలు జరుగుతున్నట్లు రైతులు తెలిపారు.

**రేషన్ బియ్యం పట్టివేత**

**కథలాపూర్:** మండలంలోని బొమ్మెనలో అక్రమంగా రేషన్ బియ్యం తరలిస్తుంటే పట్టుకున్నట్లు ఎస్‌హెచ్‌వో మధుకర్ శనివారం తెలిపారు. పోలీస్‌సిబ్బందితో కలిసి పెట్రోలింగ్ చేస్తుండగా... బొమ్మెన గ్రామశివారులో ఓ ఆటోలో 20 క్వింటాళ్ల రేషన్ బియ్యం కనిపించడంతో పట్టుకున్నామన్నారు. బియ్యంను పోలీస్‌స్టేషన్‌కు తరలించి డ్రైవర్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌హెచ్‌వో మధుకర్ పేర్కొన్నారు.

## జగిత్యాల పట్టణాభివృద్ధికి రూ.100 కోట్లతో ప్రతిపాదన



మాట్లాడుతున్న మున్సిపల్ చైర్‌పర్సన్ జ్యోతి

**జగిత్యాల:** పట్టణాభివృద్ధే ధ్యేయమని మున్సిపల్ చైర్‌పర్సన్ అడువాల జ్యోతి అన్నారు. శనివారం మున్సిపల్‌లో సర్వసభ్య సమావేశం జరిగింది.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, జగిత్యాలలో పలు అభివృద్ధి పనులు చేపట్టేందుకు ఎమ్మెల్యే సంజయ్‌కుమార్ రూ.100 కోట్ల మంజూరుకు సీఎంకు స్పెషల్ గ్రాంట్ కింద కోరడం జరిగిందని, దీనికి సీఎం సానుకూలంగా స్పందించినట్లు తెలిపారు. డీపీఆర్ తయారుచేసి వెంటనే పంపనున్నట్లు తెలిపారు.

**నక్ష పథకం కింద ఎంపిక**

కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన నక్ష అనే పథకం కింద జగిత్యాల పట్టణం ఎంపికైందని, ఎమ్మెల్యే, సీఎంకు అభినందనలు తెలిపారు. నూకపల్లి 2కేబీహెచ్‌కేలో మౌళిక వసతులు కల్పించడంతో పాటు, అర్బన్ కాలనీని మున్సిపల్‌లో విలీనం చేయడంతో పాటు, యూఆర్‌డీపీఎఫ్‌ఐ మార్గదర్శకాల ప్రకారం రైతుల భూములకు ఎలాంటి నష్టం వాటిల్లకుండా మాస్టర్ ప్లాన్ అమలు చేసేలా చర్యలు తీసుకుంటామన్నారు. సమావేశంలో 32 అంశాలకు సభ్యులు ఆమోదం తెలిపారు.

మున్సిపాలిటిలో పారిశుధ్యం అస్తవ్యస్తంగా ఉందని కొందరు సభ్యులు చైర్‌పర్సన్ దృష్టికి తీసుకువచ్చారు. డీజిల్ బిల్లు తక్కువగా వచ్చేదని, ఇప్పుడు ఒకేసారి పెరిగిందని, విచారణ చేపట్టాలని కోరారు. కార్యక్రమంలో వైస్ చైర్మన్ గోలి శ్రీనివాస్, కమిషనర్ చిరంజీవి, డీఈ యాదగిరి పాల్గొన్నారు.

## 16 అంశాలకు కోరుట్ల కౌన్సిల్ ఆమోదం



మాట్లాడుతున్న మున్సిపల్ చైర్‌పర్సన్ లావణ్య

**కోరుట్ల:** మున్సిపల్ సమావేశం స్థానిక మున్సిపల్ సమావేశ మందిరంలో శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా 16 అంశాలను ప్రవేశపెట్టగా కౌన్సిల్ సభ్యులు ఏకగ్రీవంగా ఆమోదించారు. బీజేపీ కౌన్సిలర్ పెండెం గణేష్ మాట్లాడుతూ జాతీయ రహదారి పక్కన ఉన్న సర్వే నెంబర్ 1362 లో అక్రమ నిర్మాణాలను తొలగించి సూచిక బోర్డులు ఏర్పాటు చేయాలన్నారు. ఎస్‌ఎఫ్‌ఎస్ స్కూల్ నుంచి డిగ్రీ కళాశాల వరకూ ప్రైవేట్ భూమిలో కొంత మంది మున్సిపల్ జేసీబీతో చదును చేయించుకుంటున్నారని వారిపై చర్యలు తీసుకోవాలని కోరారు. సమావేశంలో మున్సిపల్ కమిషనర్ బట్టు తిరుపతి, వైస్ చైర్మన్ గడ్డమీది పవన్, కౌన్సిలర్లు, అధికారులు పాల్గొన్నారు.

## అభివృద్ధి పనులు సకాలంలో పూర్తి చేయాలి



సమావేశంలో చైర్మన్, వైస్‌చైర్మన్, కమిషనర్

**రాయికల్:** బల్దియాలో సీసీరోడ్లు, మురికికాలువల నిర్మాణం సకాలంలో పూర్తి చేయాలని కౌన్సిలర్లు కోరారు. శనివారం రాయికల్ మున్సిపల్ కార్యాలయంలో చైర్మన్ మోర హన్మండ్లు అధ్యక్షతన సాధారణ సమావేశం నిర్వహించారు. టీయూఎఫ్‌ఐడీసీ నిధులతో ప్రారంభించిన సీసీరోడ్లు, మురికి కాలువల పనులను సకాలంలో పూర్తి చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. అనంతరం 18 అంశాలను ఏకగ్రీవంగా తీర్మానం చేశారు. నేటి నుంచి ఈనెల 9 వరకు ప్రజాపాలన విజయోత్సవాలను విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో కమిషనర్ జగదీశ్వర్‌గౌడ్, కౌన్సిలర్లు రమాదేవి, మహేందర్, సాయికుమార్, శ్రీధర్‌రెడ్డి, మహేశ్ గౌడ్, అన్వరిబేగం, కల్లెడ సునీత, మ్యాకల కాంతారావు, మ్యాకల అనురాధ, కో–ఆప్షన్ సభ్యులు మహ్మద్ మిరాజోద్దీన్, మేనేజర్ వెంకట్, ఏఈ ప్రసాద్ పాల్గొన్నారు.

## ప్రతిపక్షాలు గురుకులం హాస్టళ్లలో భోజనం చేయాలి



భోజనాన్ని పరిశీలిస్తున్న నర్సింగరావు

**ఇబ్రహీంపట్నం:** ప్రతిపక్ష నాయకులు గురుకుల పాఠశాలల్లో భోజనాలు చేయాలని కోరుట్ల నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి జువ్వాడి నర్సింగరావు అన్నారు. మండలంలోని కేజీబీవీ పాఠశాలను శనివారం సందర్శించారు. భోజనాన్ని పరిశీలించి రుచి చూశారు. అనంతరం విద్యార్థుల వద్దకు వెళ్లి వసతులు, భోజనం ఎలా పెడుతున్నారు, బోధనపై అడిగి తెలుసుకుని సంతృప్తి వ్యక్తం చేశారు. అనంతరం మాట్లాడుతూ ఎక్కడో ఒక చోట జరిగిన సంఘటనను ఆధారం చేసుకుని ఫుడ్ పాయిజన్ అంటు ప్రతిపక్ష నాయకులు ఆరోపణలు చేయడం సరికాదన్నారు. అనంతరం కాంగ్రెస్ కార్యాలయంలో సీఎంఆర్‌ఎఫ్ చెక్కులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో కేజీబీవీ ఎస్‌వో రజిత, మార్కెట్ కమిటీ చైర్మన్ బోరిగం రాజు, వైస్ చైర్మన్ ఎలాల వెంకట్‌రెడ్డి, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు గూడ శ్రీకాంత్‌రెడ్డి, నాయకులు దేవేందర్ పాల్గొన్నారు.

**విద్యార్థినికి సన్మానం**

మండలకేంద్రంలోని కేజీబీవీ విద్యార్థిని సలోమీ మండల స్థాయి గణిత టాలెంట్ పరీక్షలో ద్వితీయ స్థానం సాధించింది. ఈ సందర్భంగా విద్యార్థినిని శనివారం కాంగ్రెస్ పార్టీ కోరుట్ల నియోజకవర్గం ఇన్‌చార్జి జువ్వాడి నర్సింగరావు సన్మానించి, రూ. 1000నగదును అందచేసి, అభినందించారు.

**సీఆర్‌ఎం చెక్కులు అందజేత**

**మెట్‌పల్లిరూరల్:** పట్టణంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో శనివారం లబ్ధిదారులకు కళ్యాణలక్ష్మి,సీఎంఆర్‌ఎఫ్ చెక్కులను జువ్వాడి నర్సింగ రావు అందజేశారు. కార్యక్రమంలో పట్టణ అధ్యక్షుడు లింగం, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ అంజిరెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు మహేందర్‌రెడ్డి, నాయకులు పాల్గొన్నారు.

## అంగన్‌వాడీ కేంద్రాల్లో సమస్యల పరిష్కారానికి చర్యలు

**సారంగాపూర్:** అంగన్‌వాడీ కేంద్రాల్లో సమస్యలుంటే తన దృష్టికి తీసుకురావాలని ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి అన్నారు. శనివారం బీర్‌పూర్ మండలంలోని పలు గ్రామాల్లో పర్యటించారు. నర్సింహులపల్లె అంగన్‌వాడీ కేంద్రాన్ని పరిశీలించి నూతన భవన నిర్మాణానికి నిధులు మంజూరు చేస్తానని హామీ ఇచ్చారు. ఆయన వెంట సింగిల్‌విండో చైర్మన్ పొల్సాని నవీన్‌రావు, మాజీ ఎంపీపీ మసర్తి రమేష్, మాజీ వైస్ ఎంపీపీ బల్మూరి లక్ష్మణ్‌రావు, పార్టీ మండల శాఖ అధ్యక్షుడు చెర్పూరి సుభాష్, నాయకులు గుడిసె జితేందర్ తదితరులు ఉన్నారు.

## ప్రైవేట్ ఆస్పత్రిలో తనిఖీ

**కొండగట్టు:** కొడిమ్యాల మండలంలోని ప్రైవేట్ ఆస్పత్రులను శనివారం జిల్లా మాతా శిశు సంక్షేమ శాఖ అధికారి డాక్టర్ జైపాల్ రెడ్డి మండల కేంద్రంలోని ఆదిత్య హాస్పిటల్, సంరక్ష హాస్పిటల్ నిబంధనలకు విరుద్ధంగా నిర్వహిస్తున్నారని వారికి షోకాజ్ నోటీసులు జారీ చేశారు. హాస్పిటల్స్ రిజిస్ట్రేషన్ సమయంలో నమోదైన డాక్టర్ కాకుండా మరో డాక్టర్ ట్రీట్‌మెంట్ అందిస్తున్నట్లు గుర్తించి షోకాజ్ నోటీసులు జారీ చేసినట్లు తెలిపారు. ఈ సందర్భంగా డాక్టర్ జైపాల్ రెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వ నిబంధనలను అతిక్రమించి హాస్పిటల్స్ నిర్వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని, రిజిస్ట్రేషన్ రద్దు చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో మండల వైద్యాధికారి పరమేశ్వరి, సీహెచ్‌వో రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

## గ్రామస్తులు తీర్మానిస్తేనే పనులు చేపడతాం

**ఇబ్రహీంపట్నం:** గ్రామస్తులు తీర్మానం చేసిన తర్వాతే డ్రెయినేజీ కాలువను నిర్మిస్తామని ఆర్‌అండ్‌బీ డీఈ వెంకటరమణ అన్నారు. శనివారం మండలంలోని గోధూర్‌లో ఆగిపోయిన డ్రెయినేజీ నిర్మాణ పనులను తహసీల్దార్ ప్రసాద్, ఎంపీడీవో చంద్రశేఖర్ పరిశీలించారు. గ్రామస్తులు కూర్చొని మురికి కాలువ నిర్మాణం చేపట్టేందుకు తీర్మానం చేసి ఇస్తేనే పనులు చేపడుతామని డీఈ వెంకటరమణ గ్రామస్తులకు తెలిపారు. కార్యక్రమంలో తహసీల్దార్, ఎంపీడీవో, గ్రామస్తులు, రైతులు పాల్గొన్నారు.

**నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత**

**సారంగాపూర్:** మండల కేంద్రం సారంగాపూర్‌తో పాటు, నాయికపు గూడెం గ్రామాలకు ఆదివారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ట్రాన్స్‌కో ఏఈ ప్రవీణ్ తెలిపారు.